సాక్షి
సూర్యాపేట
శనివారం । 16 । డిసెంబర్ । 2023



అన్నం పెట్టడం లేదు!
ఆస్తి తీసుకున్న కొడుకు అన్నం పెట్టడం లేదని వృద్ధ దంపతులు నల్లగొండ ఆర్డీఓను ఆశ్రయించారు. - 8లో



స్నేహ పూర్వకంగా మెలగాలి
క్రీడాకారులు స్నేహ పూర్వకంగా మెలగాలని మహాత్మాగాంధీ యూనివర్సిటీ వీసీ ఓఎస్డీ అల్వాల రవి అన్నారు. - 8లో



సమ్మెలో తపాలా ఉద్యోగులు
గ్రామీణ డాక్ సేవక్ (జీడీఎస్) ఉద్యోగులు చేపట్టిన సమ్మెతో నాలుగు రోజులుగా పోస్టల్ సేవలు నిలిచిపోయాయి. - 8లో

న్యూస్‌రీల్

టీసీసీ పరీక్షలకు దరఖాస్తు చేసుకోండి

సూర్యాపేట టౌన్‌: టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు (టీసీసీ) లోయర్, హయ్యర్ గ్రేడ్స్‌లో డ్రాయింగ్, టైలరింగ్, ఎంబ్రాయిడరీ పరీక్షలకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా విద్యా శాఖ అధికారి కె.అశోక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్‌లో చేసుకున్న అప్లికేషన్‌తో పాటు సంబంధిత సర్టిఫికెట్స్‌ను జిల్లా విద్యా శాఖ కార్యాలయంలో సమర్పించాలని పేర్కొన్నారు. డ్రాయింగ్(లోయర్ గ్రేడ్) ఈ నెల 29వ తేదీ వరకు రూ.100 ఫీజు చెల్లించాలని సూచించారు. అలాగే డ్రాయింగ్ (హయ్యర్‌గ్రేడ్)కు రూ.150, టైలరింగ్, ఎంబ్రాయిడరీ(లోయర్ గ్రేడ్) రూ.150, టైలరింగ్, ఎంబ్రాయిడరీ(హయ్యర్‌గ్రేడ్) రూ.200 ఫీజు చెల్లించాలని పేర్కొన్నారు. అలాగే అపరాద రుసుం రూ.50 అదనంగా జనవరి 5వ తేదీ వరకు, రూ.75 అపరాద రుసుంతో జనవరి 12వ తేదీ వరకు ఫీజు చెల్లించవచ్చని పేర్కొన్నారు. లోయర్ గ్రేడ్ పరీక్షకు దరఖాస్తు చేసుకునేందుకు 7వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలని, హయ్యర్ గ్రేడ్ పరీక్షకు లోయర్‌గ్రేడ్, ఈక్వలెంట్ ఎగ్జామ్ ఉత్తీర్ణులైన అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు.

మట్టపల్లి క్షేత్రంలో నిత్యకల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మఠంపల్లి: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన మట్టపల్లి క్షేత్రంలో శుక్రవారం శ్రీలక్ష్మీనృసింహస్వామి నిత్య కల్యాణాన్ని అర్చకులు వేదమంత్రాలతో వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో సుప్రభాతసేవ, నిత్యాగ్నిహోత్రి, మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం నిర్వహించారు. రాజ్యలక్ష్మీ చెంచులక్ష్మీ సమేత స్వామివార్లకు అష్టోత్తర, సహస్ర, కుంకుమార్చనలు గావించారు. అనంతరం ముఖమండపంలో స్వామి అమ్మవార్లను నూతన పట్టు వస్త్రాలతో వధూవరులుగా అలంకరించి ఎదుర్కోలు మహోత్సవం చేపట్టారు. ఆ తర్వాత మాంగళ్య ధారణ, తలంబ్రాలతో కల్యాణం జరిపించి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈఓ నవీన్, అర్చకులు శ్రీనివాసాచార్యులు, పద్మనాభాచార్యులు, బదరీ నారాయణాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, ఆంజనేయాచార్యులు, దుర్గాప్రసాద్‌శర్మ, సీతారామాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించాలి



కరపత్రం ఆవిష్కరిస్తున్న నాయకులు

ఆత్మకూర్(ఎస్): ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంట్ సమావేశాల్లోనే ఎస్సీ వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించాలని తెలంగాణ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (టీఎమ్మార్పీఎస్) ఉమ్మడి నల్లగొండ జిల్లా ఇన్‌చార్జి కత్తి ఉపేందర్ మాదిగ డిమాండ్ చేశారు. ఇదే డిమాండ్‌తో ఈనెల 20న ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని ముద్రించిన కరపత్రాలను శుక్రవారం మండల పరిధిలోని నెమ్మికలో ఆవిష్కరించి మాట్లాడారు. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల ప్రచార సమయంలో హైదరాబాద్‌లో నిర్వహించిన బహిరంగ సభలో ప్రధాని నరేంద్ర మోదీ ఎస్సీ వర్గీకరణ చేస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు. జేపీ అభ్యర్థులను ఓడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట జిల్లా ఉపాధ్యక్షుడు పాతకట్ల రమేష్ మాదిగ, జిల్లా ప్రధాన కార్యదర్శి వి.శంకర్ మాదిగ, బాషపంగు సత్యం మాదిగ, జిల్లా నాయకులు గూడపురి ఉపేందర్ మాదిగ, ఒగ్గు గోపి మాదిగ, రవీందర్ మాదిగ పాల్గొన్నారు.

నేడు జాబ్ మేళా

సూర్యాపేట టౌన్‌: జిల్లా కేంద్రంలోని గౌతమి డిగ్రీ కళాశాలలో శనివారం ఉదయం 9గంటలకు ఎన్ఎస్‌డీసీ, స్కిల్ ఇండియా శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నామని ఆ సంస్థల నిర్వాహకులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాఫ్ట్‌వేర్ కంపెనీ డిలైట్, క్యాప్ జెమిని, ఈవై, ఏడీపీలో బ్యాంకింగ్‌లు జేపీ మోర్గాన్, స్టేట్ స్ట్రీట్ కంపెనీల్లో ఉద్యోగవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. 26 సంవత్సరాల కన్నా తక్కువ వయస్సు ఉన్న, ఏదైనా డిగ్రీ లేదా బీటెక్ గ్రాడ్యుయేట్ లు అర్హులని తెలిపారు. రూ.3లక్షల నుంచి రూ.8 లక్షల వరకు జీతం ప్యాకేజీ ఉంటుందని పేర్కొన్నారు. పూర్తి సమాచారం కోసం సెల్ : 93218 25558 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

రూ.లక్ష ఏమౌనో..!

23,374 మంది బీసీల దరఖాస్తు

- 17,985 మందిని అర్హులుగా గుర్తించిన అధికారులు
- మొదటి విడతలో 1,800 మందికి అందిన సాయం
- రెండో విడత కోసం అర్హుల ఎదురుచూపు



దురాజ్‌పల్లి (సూర్యాపేట): రూ.లక్ష ఆర్థిక సాయం కోసం దరఖాస్తు చేసి ఎదురు చూస్తున్న బీసీల్లో అయోమయ పరిస్థితి నెలకొంది. ఈ పథకాన్ని బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టగా ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఆర్థిక సాయం అందుతుందా లేదా అనే అర్హులైన వారు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలోని బీసీల్లో 15 వర్గాలకు చెందిన 1,800 మందికి మొదటి విడత రూ.లక్ష ఆర్థికసాయం అందింది. ఆ తరువాత నిధులు రాక పోవడంతో పాటు ఎన్నికల నియమావళి అమల్లోకి రావడంతో పథకం ఆగిపోయింది. ప్రస్తుతం కొత్తగా కొలువుదీరిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎలాంటి ప్రకటన చేస్తుందనే దానిపై బీసీ వర్గాల్లో ఉత్కంఠ నెలకొంది.

దరఖాస్తులు పరిశీలించి అర్హుల గుర్తింపు

సాధారణంగా బీసీ కార్పొరేషన్ ద్వారా అర్హులైన వారికి సబ్సిడీపై బ్యాంకు రుణాలు అందించేవారు. బీఆర్ఎస్ ప్రభుత్వం 2017లో ఒకసారి మాత్రమే రాయితీ రుణాలు ఇచ్చింది. ఆ తరువాత దాదాపు ఆరేళ్లగా అలాంటి రుణాలు అందించలేదు. ఈ తరుణంలో బీసీలను ఆర్థికంగా ప్రోత్సహించేందుకు బీసీ బంధు పేరుతో రూ.లక్ష ఆర్థికసాయం చేయడానికి బీఆర్ఎస్ ప్రభుత్వం కొత్త పథకం తీసుకొచ్చి దరఖాస్తులను స్వీకరించింది. జిల్లా వ్యాప్తంగా ఈ సంవత్సరం జూన్ 2నుంచి 30వ తేదీ వరకు మొత్తం 23,374 మంది దరఖాస్తులు చేసుకున్నారు. ఆ తరువాత ఎంపీడీఓల పర్యవేక్షణలో పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో పర్యటించి దరఖాస్తులను పరిశీలించి 17,985 మందిని అర్హులుగా గుర్తించి ఉన్నతాధికారులకు జాబితాను నివేదించారు.

అర్హుల ఎదురుచూపు..

రాష్ట్రంలో ప్రస్తుతంకాంగ్రెస్ ప్రభుత్వం రావడంతో రూ.లక్ష ఆర్థికసాయం కోసం దరఖాస్తులు చేసుకున్న బీసీలు అయోమయంలో పడ్డారు. ఈ పథకాన్ని కొనసాగిస్తుందా.. లేదా అని కొత్త ప్రభుత్వ నిర్ణయం కోసం ఎదురుచూస్తున్నారు. అర్హులకు ఈ పథకాన్ని వర్తింపజేయాలని కోరుతున్నారు.

ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావాల్సి ఉంది

గతంలో అప్పటి ప్రభుత్వ ఆదేశాల మేరకు బీసీలకు ఆర్థికసాయం అందించాం. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి రావడంతో రెండో విడత పంపిణీని నిలిపివేశాం. ప్రస్తుతం కొత్త ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావాల్సి ఉంది. ప్రభుత్వం నుంచి ఆదేశాల వచ్చాక తదుపరి చర్యలు తీసుకుంటాం.

– మాధవరెడ్డి, జిల్లా బీసీ అభివృద్ధి అధికారి, సూర్యాపేట

ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో..

మొదటి విడతగా నియోజకవర్గానికి 300మంది చొప్పున జిల్లాలోని హుజూర్‌నగర్, కోదాడ, సూర్యాపేట, తుంగతుర్తి నియోజకవర్గాలకు 1,200 మందిని ఎంపిక చేసి రూ.లక్ష ఆర్థికసాయం అందించారు. ఆ తరువాత ప్రభుత్వం కేటాయించిన నిధులు మిగలడంతో సూర్యాపేట నియోజకవర్గంలో 300 మంది, హుజూర్‌నగర్, కోదాడ, తుంగతుర్తిలో 200 మంది చొప్పున మొత్తం 900 మందిని ఎంపిక చేశారు. ఇందులో కోదాడలో 200 మంది మినహా 700 మందికి రూ.లక్ష ఆర్థిసాయం అందించారు. తొలి విడతలో 2,100 మందిని ఎంపిక చేసి 1,800 మందికి సాయం అందించారు. కోదాడలో లబ్ధిదారుల ఎంపిక పూర్తయ్యే నాటికి ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో చెక్కుల పంపిణీ నిలిచిపోయింది.

దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకట్రావు, పాల్గొన్న వివిధ శాఖల అధికారులు

- అర్హులైన వారికి సదరం సర్టిఫికెట్లు అందిస్తాం
- జిల్లా కలెక్టర్ వెంకట్రావు

దురాజ్‌పల్లి (సూర్యాపేట): దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని జిల్లా కలెక్టర్ ఎస్.వెంకట్రావు తెలిపారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం పురస్కరించుకొని శుక్రవారం సూర్యాపేట కలెక్టరేట్‌లో జిల్లా సంక్షేమ శాఖ నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. వికలాంగుల కోసం 2016లో తెచ్చిన ప్రత్యేక చట్టంపై అవగాహన కల్పించేందుకు త్వరలో అన్ని శాఖల జిల్లా అధికారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేస్తామన్నారు. మొన్న జరిగిన అసెంబ్లీ సాధారణ ఎన్నికల్లో దివ్యాంగుల కోసం జిల్లాలో ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు. ప్రపంచంలో ఎందరో దివ్యాంగ సైంటిస్టులు, కవులు ఉన్నారని వారిని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణికి వచ్చే దివ్యాంగుల సమస్యలను పరిశీలించి వెంటనే పరిష్కారిస్తున్నామన్నారు. మీ సేవలో సదరం సర్టిఫికెట్స్ ప్రమోషన్‌పై జరుగుతున్న ఇబ్బందులను అధికారులతో విచారణ జరిపిస్తామని తెలిపారు. అనంతరం వివిధ క్రీడ పోటీల్లో గెలుపొందిన వికలాంగులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్ఓ కోటాచలం, ఎస్సీ అభివృద్ధి అధికారి దయానందరాణి, డీసీఎస్‌హెచ్ డాక్టర్ వెంకటేశ్వర్లు, సీసీఓ అశోక్, సూర్యాపేట డీఎస్పీ నాగభూషణం, దివ్యాంగుల సంక్షేమ సంఘాల నాయకులు, దివ్యాంగులు పాల్గొన్నారు.



బహుమతులు అందజేస్తున్న కలెక్టర్

పాల ఉత్పత్తుల్లో జిల్లాను ముందుంచాలి

పాల ఉత్పత్తిలో జిల్లాను ముందుంచాలని, జిల్లాలో ఉన్న సొసైటీల బలోపేతానికి అధికారులు ప్రత్యేక కృషి చేయాలని కలెక్టర్ వెంకట్రావు కోరారు. మొదటిసారిగా ప్రభుత్వం జిల్లా కోఆపరేటివ్ డెవలప్‌మెంట్ కమిటీ ఏర్పాటు సందర్భంగా శుక్రవారం కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశానికి అదనపు కలెక్టర్ సీహెచ్ ప్రియాంకతో కలిసి కలెక్టర్ హాజరై మాట్లాడారు. సొసైటీలు, కో ఆపరేటివ్ మూమెంట్స్ బలోపేతం చేసేందుకే కమిటీని నియమించామన్నారు. ఈ కమిటీలో చైర్మన్‌గా జిల్లా కలెక్టర్‌తో పాటు కన్వీనర్‌గా డీసీఓ, సభ్యులుగా డీఏఓ, డీఏహెచ్ఓ, ఎఫ్‌డీఓ, నాబార్డు అధికారులు, వివిధ డెయిరీల సభ్యులు ఉంటారన్నారు. మత్స్య శాఖలో 160 సొసైటీలకు 115 సొసైటీలకు ఎన్నికలు నిర్వహించామని, మిగిలి ఉన్న వాటి ఎన్నికల నిర్వహణకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో డీసీఓ శ్రీధర్, డీఏహెచ్ఓ శ్రీనివాస్, ఎఫ్‌డీఓ రూపేంద్ర సింగ్, డీఎం డీసీసీబీ వసంతరావు, వివిధ డెయిరీల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాల ఆధారంగా నిధులు



జాతీయ నాణ్యతా ప్రమాణాల సంస్థ ప్రతినిధులకు పుష్పగుచ్ఛాలు అందిస్తున్న వైద్యసిబ్బంది

అర్వపల్లి: ప్రభుత్వ ఆస్పత్రుల్లో రోగులకు అందిస్తున్న వైద్యసేవలు, నిర్వహణ, సిబ్బంది పని తీరు, కల్పిస్తున్న వసతుల్లో నాణ్యతాప్రమాణాల ఆధారంగా కేంద్రం నుంచి అదనపు నిధులు సమకూరుతాయ ని జాతీయ నాణ్యతా ప్రమాణాల సంస్థ ప్రతినిధులు డాక్టర్ బాలకృష్ణన్, డాక్టర్ మాసం గోష్ అన్నారు. జాజిరెడ్డిగూడెం మండలం కాసర్లపహాడ్ గ్రామంలోని పల్లె దవాఖానాను శుక్రవారం వారు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పల్లె దవాఖానాలో నిర్వహిస్తున్న 78 రకాల రికార్డులను పరిశీలించారు. ల్యాబ్, ఫార్మసీ, ప్రసూతి గదులు, జనరల్ వార్డును తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తనిఖీ నివేదికను ఢిల్లీలోని జాతీయ నాణ్యతా ప్రమాణాల సంస్థకు అందజేస్తామని తెలిపారు. నాణ్యతా ప్రమాణాలు బాగుంటే ఈ దవాఖానాకు అభివృద్ధికి నిధులు రానున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి డాక్టర్ చిలుకూరి మణిదీప్, ఎన్‌హెచ్ఎం పీఓ కిరణ్, సీహెచ్ఓ ఎల్.చరణ్, డాక్టర్ మణిరత్నం, వెంద్రనాథ్, విజయ్, ఆశా కార్యకర్తలు మచ్చ సుజాత, అన్నపూర్ణ, నాగమ్మ, విజయ, పద్మ, సైదమ్మ, శాంతి పాల్గొన్నారు.

పోలీసు కుటుంబాలకు అండగా ఉంటాం



చెక్కు అందజేస్తున్న ఎస్పీ రాహుల్ హెగ్డే

సూర్యాపేట క్రైం: పోలీస్ శాఖలో అమలు చేస్తున్న చేయూత పథకంతో పోలీస్ కుటుంబాలకు అండగా ఉంటామని జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే అన్నారు. సూర్యాపేట పట్టణ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ ఇటీవల మృతిచెందిన ఏఎస్ఐ అంజయ్య కుటుంబ సభ్యులకు చేయూత పథకం కింద మంజూరైన రూ.2లక్షల ఆర్థికసాయం చెక్కును శుక్రవారం జిల్లా కేంద్రంలోని పోలీస్ కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ చేయూత పథకానికి ప్రతి నెలా విరాళాలు అందిస్తున్న జిల్లా సిబ్బందిని అభినందిస్తున్నామని తెలిపారు. ఈకార్యక్రమంలో పోలీస్ అధికారుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు రాంచందర్‌గౌడ్, ఆర్ఎస్ఐ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

హక్కుల సాధనకు ఐక్యంగా ఉద్యమించాలి

తుంగతుర్తి: హక్కుల సాధన కోసం యాదవులు ఐక్యంగా ఉద్యమించాలని యాదవ రాజ్యాధికార సాధన సమితి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు బడుగుల నాగార్జున యాదవ్ పిలుపునిచ్చారు. సమితి జిల్లా అధ్యక్షుడిగా తుంగతుర్తికి చెందిన ఉప్పుల నాగమల్లు యాదవ్‌ను నియమిస్తూ శుక్రవారం తుంగతుర్తిలో ఆయన నియామక పత్రం అందజేసి మాట్లాడారు. అనంతరం నాగమల్లు యాదవ్ మాట్లాడుతూ తన ఎన్నికకు సహకరించిన సమితి నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు కన్నె బోయిన మహేష్, ఉప్పుల రంగయ్య, ఉప్పుల లింగయ్య, సోమయ్య, బోయిని గణేష్, గుండాల సందీప్, జటంగి మధు తదితరులు పాల్గొన్నారు.



నాగమల్లుకు నియామకపత్రం అందజేస్తున్న ఆ సంఘం నాయకులు

నేడు జెడ్పీ స్థాయీ సంఘం సమావేశాలు

సూర్యాపేట టౌన్‌: జిల్లా పరిషత్ కార్యాలయంలో శనివారం 5, 6వ స్థాయీ సంఘాల సమావేశాలు నిర్వహిస్తున్నట్టు జెడ్పీ సీఈఓ సురేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30గంటలకు 6వ స్థాయీ, మధ్యాహ్నం 2.30గంటల నుంచి 5వ స్థాయీ సంఘం సమావేశాలు జరుగుతాయని పేర్కొన్నారు. అలాగే ఈ నెల 18న మధ్యాహ్నం 3వ స్థాయీ సంఘం సమావేశాన్ని నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. ఈ సమావేశాలకు సభ్యులు, అధికారులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

ఉమ్మడి జిల్లాకు మరో కీలక పదవి

ప్రభుత్వ విప్‌గా ఆలేరు ఎమ్మెల్యే ఐలయ్య

సాక్షి, యాదాద్రి : నూతన ప్రభుత్వంలో ఉమ్మడి జిల్లాకు మరో కీలక పదవి దక్కింది. ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యకు ప్రభుత్వ విప్ పదవి దక్కింది. రాష్ట్ర సహాయ మంత్రి హోదాలో ప్రభుత్వ విప్ బాధ్యతలను నిర్వహించనున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఆలేరు ఎమ్మెల్యేకు దక్కిన ప్రభుత్వ విప్ పదవి.. కాంగ్రెస్ ప్రభుత్వంలోనూ ఆలేరుకే దక్కడం విశేషం. ఆలేరు నుంచి తొలి ప్రయత్నంలోనే బీర్ల ఐలయ్య ఎమ్మెల్యేగా విజయం సాధించారు. ఆయన బీసీ కోటాలో మంత్రి పదవి వస్తుందని ఆశించారు. అధిష్ఠానం వద్ద ప్రయత్నాలు కూడా చేశారు. అయితే, ఇప్పటికే ఉమ్మడి జిల్లాకు చెందిన సీనియర్ ఎమ్మెల్యేలు ఎస్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిలు మంత్రులయ్యారు. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సూర్యాపేట జిల్లా నుంచి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి నల్లగొండ జిల్లా నుంచి మంత్రిగా ఉన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా నుంచి ఐలయ్యకు ప్రభుత్వ విప్ పదవి రావడంతో మూడు జిల్లాలకు పదవులు దక్కినట్లయ్యింది.

విధేయతకు దక్కిన గౌరవం

ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యకు ప్రభుత్వ విప్ పదవి దక్కడం పార్టీ విధేయతకు దక్కిన గౌరవంగా కార్యకర్తలు భావిస్తున్నారు. యాదగిరిగుట్ట మండలం సైదాపురం గ్రామానికి చెందిన అయిలయ్య ఎన్ఎస్‌యూఐ విద్యార్థి సంఘం నుంచి గ్రామ పాలసొసైటీ చైర్మన్‌గా, సర్పంచ్‌గా, యాదగిరిగుట్ట ఎంపీటీసీ సభ్యుడిగా, కాంగ్రెస్ పార్టీ యాదగిరిగుట్ట మండల శాఖ అధ్యక్షుడిగా టీపీసీసీ కార్యదర్శిగా పనిచేశారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నసమయంలో ఐలయ్యకు పలు ఇబ్బందులు ఎదురయ్యాయి. ఐలయ్య ఇంటిపై ఐటీ దాడులు కూడా జరిగాయి. పార్టీ మారాలని ఒత్తిళ్లు కూడా వచ్చాయి. అయినప్పటికీ కాంగ్రెస్ పార్టీని వీడలేదు. పార్టీకి నియోజకవర్గం ఇన్‌చార్జ్‌గా కొనసాగుతూ నియోజకవర్గంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు.



బీర్ల ఐలయ్య, ప్రభుత్వ విప్

ఆలేరుకు మూడోసారి..

ఆలేరు నియోజకవర్గానికి మూడోసారి ప్రభుత్వ విప్ పదవి దక్కింది. బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఆలేరు ఎమ్మెల్యేగా 2014, 2018లో విజయం సాధించిన గొంగిడి సునీతకు అప్పటి ప్రభుత్వంలో రెండుసార్లు ప్రభుత్వ విప్ పదవి దక్కింది. తాజాగా గెలిచిన ఐలయ్యకు ప్రభుత్వ విప్ దక్కడంతో ఆలేరుకు మూడోసారి ప్రభుత్వ విప్ దక్కినట్లు అయ్యింది.

ఒక్క రోజే 3,08,881 మంది



నల్లగొండ బస్టాండ్‌లో బస్సు ఎక్కేందుకు బారులుదీరిన ప్రయాణికులు

వీరిలో 2,17,221 మంది మహిళలే

- ఆర్టీసీ బస్సుల్లో కిక్కిరిస్తున్న జనం
- మహిళలకు జీరో టికెట్లు జారీ

నల్లగొండ రూరల్ : ప్రభుత్వం మహాలక్ష్మి గ్యారెంటీ కింద మహిళలకు రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణాన్ని అమలు చేస్తున్న విషయం తెలిసిందే. శుక్రవారం నుంచి మహిళలకు బస్సుల్లో జీరో టికెట్ జారీ చేస్తున్నారు. దీంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆర్టీసీ పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో మహిళలెందరు ప్రయాణించారో లెక్క తేలుతోంది. మొన్నటి వరకు ఎస్ఆర్ ఆధారంగా లెక్కలు తీశారు. గురువారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మొత్తం 3,08,881మంది ప్రయాణించినట్లు అధికా రులు తెలిపారు. వారిలో డబ్బులు చెల్లించిన ప్రయా ణికులు 91,660 మంది ఉండగా.. 2,17,221 మంది మహిళలు ఉచితంగా ప్రయాణించారు. ఉచితంగా ప్రయాణించిన వారు అత్యధికంగా నల్లగొండ డిపో నుంచి 50,652 మంది, అతి తక్కువగా నార్కట్‌పల్లి డిపో నుంచి 5,661 మంది ఉన్నారు.

బస్సుల్లో పెరిగిన రద్దీ..

సాధారంగా ఉమ్మడి జిల్లాలోని 7 డిపోల పరిధిలో రోజూ సగటున లక్షా 60 వేల మంది ప్రయాణిస్తుంటారు. ప్రస్తుతం మహిళలకు ఉచిత ప్రయాణం కల్పిస్తుండడంతో బస్సుల్లో రద్దీ పెరిగింది. ఉచిత ప్రయాణానికి జిల్లాలోని 7 డిపోల పరిధిలో 144 ఎక్స్‌ప్రెస్‌లు, 353 పల్లె వెలుగు బస్సులు నడుస్తున్నాయి. సహజంగా పండుగలు, ప్రత్యేక రోజుల్లో ఆర్టీసీకి రద్దీ పెరుగుతుంది. అయితే మహిళలకు ఉచిత బస్ ప్రయాణం కల్పిస్తుండడంతో బంధువుల నివాసాలకు, దూర ప్రాంతాల్లో చదువుతున్న పిల్లలను చూసి వచ్చేందుకు కుటుంబ సభ్యులు ఎక్కువగా రాకపోకలు సాగిస్తున్నారు. ఉచిత ప్రయాణం పేదలు, ఆస్పత్రులకు వెళ్లే వారికి ఆర్థికంగా వెసులుబాటు కలిగిస్తోంది.



జీరో టికెట్ తీసుకుంటున్న మహిళ

ఉపాధికి మార్గదర్శకాలు

- వచ్చే ఆర్థిక సంవత్సరానికి సిద్ధమవుతున్న యంత్రాంగం
- ప్రతి కూలీకి వంద రోజుల పని కల్పనే లక్ష్యం
- ఒక్కో పంచాయతీలో 20 రకాల పనుల ఎంపిక
- బడ్జెట్ తయారీకి గ్రామసభల్లో తీర్మానాలు చేయాలని ఆదేశం



చిలుకూరులో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

చిలుకూరు: గ్రామీణ ప్రాంతాల్లో వలసలు నివారిస్తూ కూలీలకు తమ సొంతూరులోనే పని కల్పించే ఉద్దేశంతో ఉపాధిహామీ పథకాన్ని అమలు చేస్తున్న ప్రభుత్వం 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధిచి గ్రామసభల నిర్వహణకు మార్గదర్శకాలు విడుదల చేసింది. ప్రస్తుతం ఒక్కో పంచాయతీకి 20 రకాల పనులను అధికారులు ఎంపిక చేశారు. ఈ నేపథ్యంలో బడ్జెట్ రూపకల్పనకు ఈ నెల 20వ తేదీ నాటికి గ్రామసభల్లో ఆమోదిస్తూ తీర్మానాలు చేయాలంటూ ఉన్నతాధికారులు కిందిస్థాయి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

2005లో ఉపాధిహామీకి శ్రీకారం

జీవనోపాధి లక్ష్యంగా 2005లో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకానికి కేంద్రం శ్రీకారం చుట్టింది. మొదట్లో రైతుల పొలాల్లో అభివృద్ధి పనులతో పాటుగా కూలీలకు ఉపాధి చూపించే పనులు చేపట్టారు. క్రమక్రమంగా పనుల్లో చాలా మార్పులు చేస్తూ గ్రామాల్లో సీసీ, బిల్డింగ్ పనులు కూడా చేపట్టారు. జిల్లా వ్యాప్తంగా 2.60 లక్షల జాబ్ కార్డులు ఉండగా ఇందులో 5.73 లక్షల మంది కూలీలు నమోదై ఉన్నారు. వీరిలో ప్రస్తుతం పనులు చేస్తున్న జాబ్‌కార్డులు 1.50 లక్షలు ఉన్నాయి. ఇందులోనూ ఈ ఏడాది 100 రోజులు పనులు పూర్తి చేసుకున్న కుటుంబాలు 383 ఉన్నాయి. ఇదిలా ఉంటే జిల్లాలో 4వేల మందికిపైగా వికలాంగులు ఉపాధి పనులకు వెళ్తున్నట్టు అధికారుల రికార్డుల ప్రకారం తెలుస్తోంది.

మొత్తం జాబ్‌కార్డులు	2.60 లక్షలు
కూలీల సంఖ్య	5.73 లక్షలు
వంద రోజులు పని చేసిన కుటుంబాలు	383
ఉపాధి పనులకు వెళ్తున్న వికలాంగులు	4,149

రైతులకు లబ్ధిచేకూరేలా పనులు

“ముందుగా నిర్వహించే గ్రామసభల్లో రైతులకు లబ్ధిచేకూరే పనులను గుర్తిస్తాం. వాటిని కూలీలతో చేయించేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తాం. కూలీలందరికీ 100 రోజుల పని దినాలు కల్పించాలనే లక్ష్యంతో ముందుకెళ్తున్నాం. గ్రామీణ ప్రజలు ఉపాధి హామీ పథకం ద్వారా కల్పిస్తున్న పనులను సద్వినియోగం చేసుకోవాలి.

– కిరణ్‌కుమార్, డీఆర్‌డీఓ, సూర్యాపేట

దీర్ఘకాలిక ప్రయోజనాలకే ప్రాధాన్యం

వచ్చే ఏడాది చేపట్టే పనుల్లో కూలీలకు ఉపాధితో పాటుగా దీర్ఘకాలిక పనులకు ప్రాధాన్యం ఇవ్వాలంటూ ఉన్నతాధికారులు ఆదేశించారు. ఉపాధిహామీ చట్టం ప్రకారం వచ్చే ఆర్థిక సంవత్సరానికి గాను గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు బడ్జెట్‌ను తయారు చేస్తుంటారు. 2024లో చేపట్టే పనులను గుర్తిస్తూ అందుకు అవసరమయ్యే వార్షిక ప్రణాళికతో కూలీల బడ్జెట్ రూపొందిచాలని అధికారులు ఆదేశించారు. వచ్చే ఏడాదికి ఒక్కో ప్రాంతానికి అనుకూలతను బట్టి ఉపాధి కేటగిరీలుగా 266 రకాల పనులు చేసుకొనే అవకాశాలు ఉన్నాయి. వీటిలో ప్రధానంగా పచ్చదనం, పూడికతీత, రైతుల పొలాల్లో పనులు, అనువైన ప్రాంతాలో భూగర్భ జలాల పెంపు పనులు, ఇంకుడు గుంతలు తదితర పనులు గుర్తించి కూలీలతో చేయిస్తారు.

క్లుప్తంగా

తాళం వేసిన ఇంట్లో చోరీ



ఆధారాలు సేకరిస్తున్న పోలీసులు

రామగిరి(నల్లగొండ): గుర్తుతెలియని వ్యక్తులు తాళం వేసి ఉన్న ఇంట్లోకి చొరబడి చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటన తిప్పర్తి మండలం చిన్నాయి గూడెంలో శుక్రవారం వెలుగులోకి వచ్చింది. చిన్నాయిగూడెం గ్రామానికి చెందిన బత్తుల నాగరాజు గురువారం ఉదయం 10గంటలకు ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి పొలం పనులకు వెళ్లాడు. సాయంత్రం తిరిగి ఇంటికి వచ్చి చూసేసరికి తాళం పగులగొట్టి ఉంది. లోపలికి వెళ్లి చూసేసరికి వస్తువులు చిందరవందరగా పడి ఉన్నాయి. బీరువా తలుపులు తెరిచి ఉండటం గమనించారు. దాచి పెట్టిన తులం బంగారం, 55వేల నగదు అపహరణకు గురైనట్లు గుర్తించారు. శుక్రవారం ఉదయం తిప్పర్తి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో క్లూస్ టీమ్‌తో వచ్చి వేలిముద్రలు సేకరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ధర్మ తెలిపారు.

బైకు అదుపుతప్పి యువకుడు మృతి



శివసాయి (ఫైల్)

నాగార్జునసాగర్: బైకు అదుపుతప్పి కిందపడడంతో తీవ్రంగా గాయపడి ఓ యువకుడు మృతిచెందాడు. నాగార్జునసాగర్‌లోని పైలాన్ కాలనీకి చెందిన శివసాయి(27) పని నిమిత్తం శుక్రవారం ఇంటి నుంచి బైక్‌పై బయలుదేరాడు. జెన్‌కో కార్యాలయం సమీపంలోకి వెళ్లగానే బైక్ అదుపుతప్పి బోల్తాకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై ఉన్న శివసాయి తలకు బలమైన గాయాలయ్యాయి. స్థానికులు అతడిని కమలానెహ్రూ ఏరియా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ ఘటనపై ఫిర్యాదు అందలేదని ఎస్ఐ సంపత్‌గౌడ్ తెలిపారు.

రైస్ మిల్లులపై రెండో రోజు ఐటీ దాడులు

మిర్యాలగూడ: మిర్యాలగూడ పరిధిలోని పలు రైస్ మిల్లుల మీద ఆదాయపు పన్ను శాఖ అధికారుల దాడులు శుక్రవారం కూడా కొనసాగాయి. ఆరు బృందాలుగా ఏర్పడి మిర్యాలగూడలోని పలు రైస్ మిల్లుల్లో ఆదాయ పన్ను అధికారులు విస్తృత సోదాలు చేస్తున్నారు. ధాన్యం కొనుగోలు సమయంలో, బియ్యం అమ్మే సమయంలో ప్రభుత్వానికి చెల్లించాల్సిన పన్ను చెల్లించారా లేదా అనే విషయంపై లోతుగా తనిఖీలు చేపడుతున్నారు. రైస్ మిల్లుల్లో లావాదేవీలపై ఆరాతీస్తున్నారు. ఎన్నికల ముందు నవంబర్ 16, 17 తేదీల్లో ఒక దఫా దాడులు సాగించిన ఐటీ అధికారులు కీలక ఆధారాలు సేకరించారు. రూ.5కోట్ల నగదుతోపాటు కంప్యూటర్లు, హార్డ్ డిస్క్‌లు, కీలక పత్రాలు స్వాధీనం చేసుకున్నారు. నెల రోజులు గడవక ముందే రెండో దఫా మిర్యాలగూడ మిల్లర్లపై ఐటీ దాడులు కొనసాగడం మిల్లర్లతో పాటు రియల్ వ్యాపారులు బెంబేలెత్తుతున్నారు.

దోమలపల్లిలో చోరీ

నల్లగొండ క్రైం : గుర్తుతెలియని వ్యక్తులు తాళం వేసిన ఇంట్లో చోరీకి పాల్పడ్డారు. నల్లగొండ మండలం దోమలపల్లి గ్రామానికి చెందిన కాసాని పాపయ్య కుటుంబ సభ్యులు శుక్రవారం ఇంటికి తాళం వేసి వ్యవసాయ పనులకు వెళ్లారు. గమనించిన దుండగులు పాపయ్య ఇంటి తాళం పగులగొట్టి లోనికి చొరబడ్డారు. బీరువాలో దాచిన రూ.2లక్షల నగదుతో పాటు బంగారు, వెండి ఆభరణాలు ఎత్తుకెళ్లారు. సాయంత్రం బాధితుడు ఇంటికి రాగా చోరీ విషయం వెలుగుచూసింది. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు నల్లగొండ రూరల్ పోలీస్‌స్టేషన్ పోలీసులు తెలిపారు.

సమ్మెలో తపాలా ఉద్యోగులు

- నాలుగు రోజులుగా నిలిచిన సేవలు
- చాలీచాలని వేతనాలతో ఇబ్బందులు పడుతున్నామని జీడీఎస్‌ల ఆవేదన
- న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని విజ్ఞప్తి



సూర్యాపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న గ్రామీణ డాక్ సేవక్‌లు

భువనగిరి, మిర్యాలగూడ టౌన్: గ్రామీణ డాక్ సేవక్ (జీడీఎస్) ఉద్యోగులు చేపట్టిన సమ్మెతో పోస్టల్ సేవలు నిలిచిపోయాయి. తమ సమస్యలు పరిష్కరించాలని ఈ నెల 12నుంచి ఉమ్మడి జిల్లాలోని అన్ని తపాలా కార్యాలయాల వద్ద ఉద్యోగులు సమ్మె చేస్తున్నారు. ఉమ్మడి జిల్లా పరిధిలోని యాదాద్రి భువనగిరి, సూర్యాపేట, నల్లగొండ జిల్లాలోని ప్రధాన తపాల కార్యాలయాలు ఉన్నాయి. వీటి పరిధిలో 57 హెడ్ పోస్టాఫీసులు ఉంటే వీటి పరిధిలో 54 సబ్ పోస్టాఫీసులు, 840 బ్రాంచీలు ఉన్నాయి. ఆయా పోస్టాఫీసుల పరిధిలో 1300 నుంచి 1400 మందికి పైగా గ్రామీణ డాక్ సేవకులు పని చేస్తున్నారు. వీరు పార్ట్‌టైం ఉద్యోగులే అయినప్పటికీ పూర్తి స్థాయిలో సేవలందిస్తున్నారు. వీరు ఎన్ఆర్ఈజీఎస్, పింఛన్లు, ఆర్‌డీ, ఎస్‌బీ, సుకన్య, ఆర్‌పీఎల్ఐ, ఉత్తరాల బట్వాడా తదితర విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది.

ఎక్కడి ఉత్తరాలు అక్కడే

జీడీఎస్‌లు సమ్మె బాట పట్టడంతో నాలుగు రోజులుగా సేవలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. ఉత్తరాల బట్వాడా, సుకన్య, ఆర్‌డీ, వంటి సేవలు ప్రజలకు అందడం లేదు. సమస్యల పరిష్కారం కోసం ఆలిండియా గ్రామీణ డాక్ సేవక్ యూనియన్, నేషనల్ యూనియన్ ఆఫ్ గ్రామీణ డాక్ సేవక్(జీడీఎస్) పిలుపు మేరకు ఈ ఉద్యోగులు సమ్మెలోకి వెళ్లారు.



భువనగిరిలో తపాలా కార్యాలయం వద్ద సమ్మె చేస్తున్న జీడీఎస్‌లు (ఫైల్)

డిమాండ్లు ఇవే..

- 8 గంటలు పని అమలు చేయడంతో పాటు పింఛన్‌తో సహా అన్ని ప్రయోజనాలు కల్పించాలి.
- కమలేష్ చంద్ర కమిటీ సిఫారసులు అమలు చేయాలి
- ఆరోగ్యబీమా రూ.5లక్షలు చెల్లించాలి
- పెయిడ్ సెలవులను నగదుగా మార్చుకునే సౌకర్యం కల్పించాలి.
- 12,24, 36 సంవత్సరాల సర్వీసులకు అదనపు ఇంక్రిమెంట్లు మంజూరు చేసి ఆర్థిక ఉన్నతి కల్పించాలి
- ఎస్‌డీబీఎస్‌కు, జీడీఎస్‌లకు కాంట్రిబ్యూషన్ 10శాతం, డిపార్ట్‌మెంటు కాంట్రిబ్యూషన్ ఇవ్వాలి. అదే విధంగా తాత్కాలిక పెన్షన్ సౌకర్యాన్ని కల్పించాలి.
- సేవలు వృద్ధి చేయడానికి, సత్వరంగా అందించేందుకు మొబైల్ డివైజ్‌లను ఉపసంహరించి
- ల్యాప్‌ట్యాప్‌లు, ప్రింట్స్, బ్రాండ్‌బాండ్ నెట్‌వర్క్ అన్ని బ్రాంచ్ పోస్టాఫీసులకు ఇవ్వాలి.
- ఇన్‌సెంటీవ్, కమిషన్ పద్ధతిని రద్దు చేసి జీడీఎస్‌లు చేసే ప్రతి పనిని వర్క్‌లోడ్‌లోకి తీసుకోవాలి.

“ శ్రమకు తగిన వేతనం చెల్లించాలి



జీడీఎస్‌లకు శ్రమకు తగిన వేతనం లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. ప్రభుత్వం సమాన పనికి సమాన వేతనం చెల్లించాలి. ఎనిమిది గంటల పని కల్పించాలి. మా సమస్యలను పరిష్కరించే వరకు సమ్మెను కొనసాగిస్తాం.

– సత్తయ్య, జీడీఎస్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు, భువనగిరి

“ అధికారులు బెదిరిస్తున్నారు



కరోనా సమయంలో కూడా ఇంట్లో ఉండకుండా పనిచేశాం. అలాంటి పరిస్థితిల్లో పనిచేసిన పనికి సరిపడా వేతనం ఇవ్వడం లేదు. తమ న్యాయమైన డిమాండ్ల సాధనకు సమ్మె చేస్తుంటే అధికారులు నోటీసులు ఇచ్చి తొలగిస్తామని బెదిరింపులకు పాల్పడుతున్నారు.

–సుకన్య, జీడీఎస్, భువనగిరి

“ సరైన వేతనాలు లేక ఇబ్బందులు



వేతనాలు రాక ఇబ్బందులు పడుతున్నాం. ప్రభుత్వం సమాన పనికి సమాన వేతనం అందించాలి. ఎనిమిది గంటల పని విధానాన్ని అమలు చేయడంతో పాటు న్యాయమైన డిమాండ్లను తక్షణమే నెరవేర్చాలి.

– పుట్టల రవి, జీజేసీప చైర్మన్, సూర్యాపేట డివిజన్

“ కుటుంబ పోషణ భారంగా మారింది



సరైనా వేతనాలు లేక కుటుంబ పోషణ భారంగా మారింది. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా తపాల గ్రామీణ డాక్ సేవలను వేతనాలు పెంచాలి. తమ న్యాయమైన డిమాండ్లు వెంటనే నెరవేర్చాలి.

– జి.నాగరాజు, పీజేసీప కన్వీనర్, సూర్యాపేట డివిజన్

ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో ఉంటా

- ఏఐసీసీ సభ్యుడు జడ్సన్



ఎమ్మెల్సీ ఎన్నికల్లో బలపర్చాలని రూపొందించిన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జడ్సన్ తదితరులు

నల్లగొండ టౌన్ : ఖమ్మం, వరంగల్, నల్లగొండ జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం నుంచి ఎమ్మెల్సీ ఎన్నికల్లో తాను పోటీ చేయనున్నట్లు ఏఐసీసీ సభ్యుడు బక్క జడ్సన్ తెలిపారు. నల్లగొండలోని అంబేద్కర్‌భవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రశ్నించే గొంతుకైన తనను జిల్లాలోని పట్టభద్రులు, మేధావులు, ఉద్యమకారులు బలపర్చాలని కోరారు. తెలంగాణలో పదేళ్ల పాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వంపై విద్యార్థులు, నిరుద్యోగుల పక్షాన పోరాడానని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ టికెట్ ఇవ్వకపోతే స్వతంత్ర అభ్యర్థిగా బరిలో ఉంటానని తెలిపారు. అనంతరం ఎన్నికల్లో తనను బలపర్చాలని కోరుతూ రూపొందించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు.సమావేశంలో లక్ష్మణ్‌యాదవ్, గిరిబాబు, వీరమల్ల వేణు, వడ్డెబోయిన సైదులు, కొండేటి మహేష్, రాంబాబు, రమేష్, కిరణ్, రాజు పాల్గొన్నారు.

సాంకేతిక కోర్సుల్లో ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

భూదాన్‌పోచంపల్లి : మండలంలోని జలాల్‌పురంలోని స్వామి రామానందతీర్థ గ్రామీణ సంస్థలో కేంద్ర ప్రభుత్వం దీన్‌దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్యయోజన (డీడీయూజీకేవై) కింద ఉపాధి ఆధారిత పలు సాంకేతిక కోర్సుల్లో ఉచిత శిక్షణకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నామని సంస్థ డైరెక్టర్ పీఎస్ఎస్ఆర్ లక్ష్మి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడు నెలల కాలపరిమితి కల్గిన బేసిక్ కంప్యూటర్స్ కోర్సుకు ఇంటర్మీడియట్, అకౌంట్స్ అసిస్టెంట్ (ట్యాలీ)కోర్సుకు బీకామ్, కంప్యూటర్ హార్డ్‌వేర్ కోర్సుకు ఇంటర్మీడియట్, ఆటోమొబైల్ 2,3 వీలర్ సర్వీసింగ్ కోర్సుకు పదో తరగతి విద్యార్హత కల్గి ఉండాలని తెలిపారు. నాలుగు నెలల కాలపరిమితి కల్గిన సెల్‌ఫోన్ అండ్ ఎలక్ట్రానిక్ వస్తువుల రిపేర్ కోర్సుకు పదో తరగతి, సోలార్ సిస్టమ్ ఇన్‌స్టాలేషన్ అండ్ సర్వీస్ కోర్సుకు పదో తరగతి లేదా ఐటీఐ విద్యార్హత ఉండాలని పేర్కొన్నారు. 5 నెలల కాలవ్యవధి గల ఎలక్ట్రిషియన్ (డొమెస్టిక్) కోర్సుకు పదో తరగతి పాస్ లేదా ఐటీఐ విద్యార్హత కల్గిన వారు అర్హులని తెలిపారు. అభ్యర్థులు 18 నుంచి 30 సంవత్సరాల మధ్య వయస్సు కల్గి ఉండాలని తెలిపారు. అర్హత ఆసక్తి కల్గిన అభ్యర్థులు తమ విద్యార్హతల సర్టిఫికెట్స్ ఒర్జినల్, జీరాక్స్ కాపీలతో పాటు రెండు పాస్‌పోర్ట్ ఫొటోలు, ఆధార్‌కార్డు, రేషన్‌కార్డును వెంట తీసుకొని జనవరి 2న, 2024న ఉదయం 10 గంటల నుంచి సంస్థలో నిర్వహించే కౌన్సిలింగ్‌కు నేరుగా హాజరు కావాలని తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు ఉచిత శిక్షణ, హాస్టల్, భోజన వసతితో పాటు శిక్షణ పూర్తయిన తరువాత తప్పనిసరిగా ఉద్యోగం కూడా కల్పించబడుతుందని తెలిపారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు 9133908000, 9133908111, 9133908222 ఫోన్ నంబర్లను సంప్రదించాలని పేర్కొన్నారు.

ఎలుకల మందు తాగిన యువకుడు మృతి

చౌటుప్పల్ : ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న యువకుడు మృతిచెందాడు. నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలం గుడివాడ గ్రామానికి చెందిన పగిడి శివ(23) రెండు నెలల క్రితం చౌటుప్పల్‌కు వచ్చాడు. పట్టణ కేంద్రంలోని హనుమాన్‌నగర్ కాలనీలో అద్దెకు ఉంటున్నాడు. భూదాన్‌పోచంపల్లి మండల పరిధిలోని ఓ పరిశ్రమలో పనిచేస్తున్నాడు. ఈనెల 7న రాత్రి శివ తన గదిలో ఎలుకల మందు తాగాడు. అనంతరం కుటుంబ సభ్యులకు ఫోన్‌లో సమాచారం ఇచ్చాడు. ఓ అమ్మాయిని ప్రేమించానని, తన ప్రేమ విఫలం కావడంతో ఆత్మహత్య చేసుకుంటున్నానని తెలిపాడు. వెంటనే వారు వచ్చి అతన్ని హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శివ శుక్రవారం ఉదయం మృతిచెందాడు. మృతుడి తండ్రి లింగయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాక్టర్‌ను వెనుకనుంచి ఢీకొట్టిన కారు

- కారు డ్రైవర్‌కు తీవ్ర గాయాలు.. ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి
- నల్లగొండ శివారులో ఘటన



ఉమేష్(ఫైల్)

నల్లగొండక్రైం: అతి వేగంగా వెళ్తున్న ఓ కారు ముందు వెళ్తున్న ట్రాక్టర్‌ను వెనుకనుంచి ఢీకొట్టింది. ప్రమాదంలో కారు డ్రైవర్ తీవ్రంగా గాయపడి ఆస్పత్రికి తరలిస్తుండగా మృతిచెందాడు. నల్లగొండ శివారు పానగల్ ఉదయ సముద్రం చెరువు కట్ట కింద జరిగిన ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. సూర్యాపేట జిల్లా మద్దిరాల మండలం గోరంట్ల గ్రామానికి చెందిన సంగని ఉమేష్ (28) ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగిగా పని చేస్తున్నాడు. ఉమేష్ గురువారం ఉదయం కంపెనీ పని నిమిత్తం నల్లగొండకు వచ్చాడు. రాత్రి 8 గంటల ప్రాంతంలో తిరిగి సూర్యాపేటకు బయలుదేరాడు. మార్గమధ్యలో పాగనల్ చెరువు కట్ట మూల మలుపు వద్ద ముందుగా వెళ్తున్న ట్రాక్టర్ వేగంగా ఢీకొట్టాడు. ప్రమాదంలో ఉమేష్ తీవ్రంగా గాయపడి కారులోనే ఇరుక్కుపోయాడు. ట్రాక్టర్‌ట్రాలీ రోడ్డు పక్కన పొలాల్లోకి దూసుకెళ్లి నిలిచిపోయింది. సమీప ప్రజలు గమనించి పోలీసులకు, 108కు సమాచారం అందించారు. కారులో ఇరుక్కుపోయిన ఉమేష్‌ను బయటకు తీసి ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతిచెందాడు. మృతుడి తండ్రి మహేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రమాదకరంగా మూల మలుపు.. ఆపై రోడ్డంతా చీకటిమయం

పానగల్ చెరువు కట్ట వద్ద ఉన్న మూలమలుపు ప్రమాదకరంగా మారిందని వాహనదారులు పేర్కొంటున్నారు. దీనికి రోడ్డంతా చీకటిమయం కావడంతో పాటు ప్రస్తుతం కురుస్తున్న మంచుతో వాహనాలు కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయని అంటున్నారు. నెల రోజుల క్రితం పానగల్‌కు చెందిన ఓర్సు విష్ణు–స్వప్న దంపతులు ఇదే రోడ్డుపై వాకింగ్ చేస్తుండగా బొలేరో వెహికల్ డ్రైవర్ వీరిని గుర్తించక ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందిన విషయం తెలిసిందే. ప్రధానంగా పానగల్ చెరువు కట్టపై ఉన్న వెలుతురు రోడ్డుపైకి కనిపించడం లేదు. పానగల్ సర్కిల్ నుంచి ఉదయ సముద్రం అలుగు వరకు మున్సిపాలిటీ వీధి దీపాలు ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

ఆటో బోల్తా.. పలువురు కూలీలకు గాయాలు



ఘటనాస్థలంలో గాయపడిన కూలీలు

భువనగిరి క్రైం : ఆటో అదుపుతప్పి బోల్తాకొట్టడంతో పలువురు కూలీలకు గాయాలయ్యాయి. ఈ ఘటన భువనగిరి మండలం బొల్లెపల్లి గ్రామ సమీపంలో శుక్రవారం చోటు చేసుకుంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం బాపట్ల మండలం ఝెట్టువారిపాలెం గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీలు వారం రోజులుగా భువనగిరి పరిసర ప్రాంతాల్లో వరినాట్లు వేసేందుకు వచ్చారు. ఈ నేపథ్యంలో శుక్రవారం మండలంలోని సిరివెనికుంట ఆవాస చెన్నోల్లబావి వద్ద వరినాట్లు ముగించుకొని 25మంది కూలీలు బొల్లేపల్లి గ్రామ పరిధి మద్దివారిగూడేనికి బయలుదేరారు. మార్గమధ్యలో గుంతను తప్పించబోయి ఆటో అదుపుతప్పి బోల్తా కొట్టింది. ప్రమాదంలో అందులో ప్రయాణిస్తున్న పలువురు కూలీలకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను భువనగిరి ఏరియా ఆసుపత్రికి తరలించారు. అందులో రామకృష్ణారెడ్డి, కిషోర్ రెడ్డి, బక్కమ్మ, పద్మావతి, వెంకట భూలక్ష్మి, మాణిక్యమ్మ, తిరుపతమ్మ, నాగమణిలను సికింద్రాబాద్ గాంధీ ఆసుపత్రికి, ఏడుకొండలమ్మ, శేషు, శ్రావణి, వరలక్ష్మి, కోటేశ్వరమ్మ, పిట్ల పద్మావతి, ముచ్చర్ల లక్ష్మి ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ పోలీసులు తెలిపారు. గాయపడిన కూలీలకు మెరుగైన చికిత్స అందించాలని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్‌రెడ్డి కోరారు.

జాతీయ స్థాయి స్కూల్ గేమ్స్‌కు ఎంపిక



పోటీలకు ఎంపికైన మునుగోడు పలివెల ఉన్నత పాఠశాల విద్యార్థులతో ఉపాధ్యాయులు

మునుగోడు: జాతీయ స్థాయి 67వ స్కూల్ గేమ్స్ పోటీలకు మునుగోడు మండలంలోని పలివెల ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ఎంపికయ్యారు. కోదాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఈనెల 14న నిర్వహించిన పోటీల్లో పాఠశాలకు చెందిన విద్యార్థులు అండర్ 17 బాలుర విభాగంలో మోక్షజ్ఞ, వినయ్, రోహిత్, బాలికల విభాగంలో మేఘన, నక్షత్ర, అండర్ 14 బాలుర విభాగంలో దినేష్ కార్తీక్, సాయి చరణ్ తేజ, సిద్ధు, సాయిచరణ్, బాలికల విభాగంలో కీర్తన, వైష్ణవి, ఉషశ్రీలు ప్రతిభ చూపి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరిని శుక్రవారం ఆ పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

మంగళపల్లి విద్యార్థులు హ్యాండ్‌బాల్ పోటీలకు..



శివాణి, 9వ, తరగతి



శివ, 8వ, తరగతి

నకిరేకల్ : నకిరేకల్ మండలం మంగళపల్లి గ్రామ జెడ్పీ హైస్కూల్లో చదువుతున్న విద్యార్థులు శివాణి (9వ),శివ(8వ) జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారని ఆ పాఠశాల హెచ్ఎం కర్ర వీరారెడ్డి, పీఈటీ చింతకాయల పుల్లయ్య తెలిపారు. వీరు ఆదిలాబాద్‌లో స్కూల్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈనెల 8 నుంచి 10 వరకు నిర్వహించిన అండర్ 14 బాల బాలికల రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ టోర్నమెంట్‌లో ఉమ్మడి జిల్లా జట్టు నుంచి ప్రాతినిధ్యం వహించి ప్రతిభ చూపారని పేర్కొన్నారు. వీరు ఈనెల 16 నుంచి 20వ తేదీ వరకు ఢిల్లీలో జరిగే జాతీయ స్థాయి హ్యాండ్ బాల్ పోటీల్లో పాల్గొటారని తెలిపారు. ఎంపికైన విద్యార్థులను ఎంపీపీ బచ్చుపల్లి శ్రీదేవి గంగధర్‌రావు, సర్పంచ్ ప్రగఢపు నవీన్‌రావు అభినందించారు.



చివ్వెంల : బేస్‌బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులు

రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీలకు..

చివ్వెంల(సూర్యాపేట) : రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీలకు చివ్వెంల మండల గురుకుల పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ యాదయ్య తెలిపారు. కోదాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఈనెల 14న నిర్వహించిన ఉమ్మడి జిల్లాస్థాయి బేస్‌బాల్ పోటీల్లో అండర్–14 బాలుర విభాగంలో పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థి బి.అజిత్, అభినయ్ కుమార్, అండర్–17 విభాగంలో 10వ తరగతి విద్యార్థులు బి.తేజ్‌కుమార్, బి.వినయ్‌లు ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. ఈ సందర్భంగా ఆ విద్యార్థులను ఉపాధ్యాయులు ఎం.సుజాత, షేక్ రహీం, డి.బాలు అభినందించారు.

విద్యార్థులకు స్వీయ అవగాహన ఉండాలి

నల్లగొండ రూరల్: విద్యార్థులకు లక్ష్య సాధనలో స్వీయ అవగాహన ఉండాలని ఎక్సైజ్ సీఐ ఏడుకొండలు అన్నారు. మహాత్మాగాంధీ యూనివర్సిటీలో కెరీర్ డెవలప్‌మెంట్ అండ్ స్ట్రెస్ మేనేజిమెంట్ అంశంపై నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. యూనివర్సిటీ పట్టాతో పాటు ఉద్యోగం సాధించేందుకు అన్ని అంశాల పట్ల అవగాహన ఉండాలన్నారు. తాను మిషన్ అనే సంస్థను ఏర్పాటు చేసి అనేక మంది విద్యార్థులకు స్వచ్ఛందంగా శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు.అన్ని సేవల్లో విజ్ఞానాన్ని అందించడమే శ్రేష్టమన్నారు. పట్టుదల,కృషి, అంకిత భావంతో ఉన్నత లక్ష్యాలను చేరుకోవచ్చన్నారు. కార్యక్రమంలో కాంపిటీషన్ సెల్ డైరక్టర్ రమేష్, మద్దిలేటి, జ్యోతి, బిక్షమయ్య పాల్గొన్నారు.

క్రీడాకారులు స్నేహపూర్వకంగా మెలగాలి



హాకీలో తలపడుతున్న క్రీడాకారులు

నల్లగొండ రూరల్: క్రీడాకారులు స్నేహపూర్వకంగా మెలగాలని మహాత్మాగాంధీ యూనివర్సిటీ వీసీ ఓఎస్‌డీ అల్వాల రవి అన్నారు. ఇంటర్ కాలేజీయేట్ టోర్నమెంట్ (ఐసీటీ), ఇంటర్ యూనివర్సిటీ టోర్నమెంట్ (ఐయూటీ) జట్ల ఎంపికకు శుక్రవారం మహాత్మాగాంధీ యూనివర్సిటీలో హ్యాండ్ బాల్, హాకీ పోటీలు నిర్వహించారు. మహిళా జట్లు 8, పురుషుల జట్లు 10 చొప్పున పాల్గొన్నాయి. క్రీడాకారులను వీసీ ఓఎస్‌డీ అల్వాల రవి పరిచయం చేసుకుని ప్రారంభించారు. యూనివర్సిటీ స్థాయిలో ప్రతిభ చూపిన ఐయూజట్లను అభినందించారు. హాకీ పురుషుల విభాగంలో రామన్నపేట గురుకుల డిగ్రీ కాలేజీ విజేతగా నిలిచింది. హ్యాండ్‌బాల్ మహిళల విభాగంలో హాలియాకు చెందిన ఓ ప్రైవేట్ కాలేజీ జట్టు విజయం సాధించింది. కార్యక్రమంలో క్రీడల అభివృద్ధి అధికారులు మురళి, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

బాలికల ఆచూకీ లభ్యం

- నాలుగు మాసాల క్రితం ఇంటినుంచి పారిపోయిన అక్కాచెల్లెళ్లు
- బొమ్మలు విక్రయించే వారి సహాయంతో యాదాద్రి జిల్లా ఆరెగూడెంలో ప్రత్యక్షం
- బాలికలు నాగర్‌కర్నూల్ జిల్లా తెలకపల్లి మండలం గౌరారానికి చెందిన వారుగా గుర్తింపు
- పోలీసుల సమక్షంలో తల్లిదండ్రులకు అప్పగింత

చౌటుప్పల్ : నాలుగు మాసాల క్రితం ఇంటి నుంచి పారిపోయిన ఇద్దరు బాలికలను గుర్తించిన అధికారులు శనివారం తల్లిదండ్రులకు అప్పగించారు. నాగర్‌కర్నూల్ జిల్లా తెలకపల్లి మండలం గౌరారం గ్రామానికి చెందిన ఇద్దరు బాలికలు అదే గ్రామంలో 8వ, 6వ తరగతులు చదువుతున్నారు. వీరు ఈ ఏడాది ఆగస్టు 22న ఇంటి నుంచి పారిపోయారు. ఏడాది క్రితం వీరి తమ్ముడు మృతిచెందాడు. దాంతో తల్లి మానసికంగా కుంగిపోయింది. అదే సమయంలో తండ్రి తాగుడుకు బానిసగా మారాడు. ఈ క్రమంలో అక్కాచెల్లెళ్లు మానసిక వేదనకు గురయ్యారు. చేసేదేమీ లేక ఇంటి నుంచి వెళ్లిపోవాలని నిర్ణయించుకున్నారు. అలా ఇంట్లో నుంచి వచ్చిన వారు అదే రోజు న నాగర్‌కర్నూల్‌కు చేరుకున్నారు. అక్కడ వీధుల్లో తిరుగుతున్న వీరిని బొమ్మలు విక్రయించే ఓ కుటుంబం చేరదీసింది. గ్రామాల్లో సంచరిస్తూ బొమ్మలు అమ్ముకునే వారి వెంటనే వీరు కూడా తిరగసాగారు. అందులో భాగంగా ఇటీవల చౌటుప్పల్ మండలం ఆరెగూడేనికి చేరుకున్నారు. 15రోజుల క్రితం బొమ్మలు విక్రయించే కుటుంబం బాలికలను ఆరెగూడెంలో విడిచిపెట్టిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని తమ స్వగ్రామానికి వెళ్లిపోయింది. దాంతో ఆరెగూడెం గ్రామానికి చెందిన ఓ రైతు దంపతులు బాలికలను చేరదీశారు. గ్రామస్తుల సూచన మేరకు శనివారం స్థానికంగా ఉన్న ప్రాథమికోన్నత పాఠశాలలో చేర్పించేందుకు తీసుకెళ్లగా ప్రధానోపాధ్యాయుడు పూర్తి వివరాలు తెలుసుకున్నారు. ఆధార్‌కార్డు ద్వారా ఆ బాలికలు నాగర్‌కర్నూల్ జిల్లా తెలకపల్లి మండలం గౌరారానికి చెందిన వారుగా గుర్తించి 1098 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం అందించాడు. భువనగిరికి చెందిన జిల్లా బాలల సంరక్షణ అధికారి సైదులు ఆరెగూడేనికి వెళ్లి బాలికల తల్లిదండ్రులతోపాటు అక్కడి ఎస్ఐకి సమాచారం ఇచ్చాడు. బాలికలిద్దరిని బాలరక్ష భవన్‌కు తరలించారు. సాయంత్రం తెలకపల్లి ఎస్ఐ సమక్షంలో బాలికలను వారి తల్లిదండ్రులకు అప్పగించారు. తమ కుమార్తెల ఆచూకీ లభ్యం కావడంతో తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు.

ఆస్తులు తీసుకుని అన్నం పెట్టడం లేదు !

- నల్లగొండ ఆర్డీఓకు వృద్ధ దంపతుల ఫిర్యాదు



ఆర్డీఓ కార్యాలయానికి ఆటోలో వచ్చిన వృద్ధ దంపతులు క్షేత్రయ్య, రజనీ

నల్లగొండ: నలుగురు ఆడపిల్లల తోడ ఒక్కడే కొడుకని అల్లారు ముద్దుగా పెంచి పెద్ద చేశాం.. ఆస్తులు, బంగారం, ప్రతి నెలా వచ్చే పింఛన్ డబ్బులు అన్నీ అప్పగించాం. అవసాన దశలో ఆలనా పాలనా చూడకుండా సరిగా భోజనం కూడా పెట్టడం లేదని ఓ వృద్ధ దంపతులు శుక్రవారం నల్లగొండ ఆర్డీఓ రవికి మొరపెట్టుకున్నారు. వివరాలు ఇలా.. నల్లగొండ పట్టణంలోని శివాజీనగర్‌కు చెందిన మురారిశెట్టి క్షేత్రయ్య, రజనీ దంపతులకు నలుగురు కూతుళ్లు, కుమారుడు సంతానం. అందరికీ వివాహాలు జరిపించారు. క్షేత్రయ్య దేవాదాయ శాఖలో సూపరింటెండెంట్‌గా ఉద్యోగ విరమణ చేశారు. క్షేత్రయ్యకు పట్టణంలో రెండు నివాసాలు ఉండగా ఒక ఇంటిలో భార్యతో కలిసి ఉంటుండగా మరో ఇంట్లో ఆయన కుమారుడు, కోడలు ఉంటున్నారు. ఏడాది క్రితం కుమారుడు తన వద్దకు తీసుకెళ్లి ఆస్తులు, డబ్బులు, బంగారంతో పాటు ప్రతి నెలా పింఛన్ డబ్బులు తీసుకుంటూ సరిగా భోజనం కూడా పెట్టడం లేదని ఆర్డీఓ ఎదుట ఆ వృద్ధ దంపతులు వాపోయారు. కమారుడు ఆస్తులను తన భార్య పేరిట రాయించుకుని, సరిగా చూడకుండా చిత్రహింసలు పెడుతున్నారని కన్నీళ్లు పెట్టుకున్నారు. ప్రతి నెలా వచ్చే పింఛన్ డబ్బులతో తామిద్దరమే స్వతంత్రంగా జీవించేలా చూడాలని ఆర్డీఓను కోరారు. మీ కుమారుడిని పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చి న్యాయం చేస్తానని ఆర్డీఓ వృద్ధ దంపతులకు హామీ ఇచ్చి పంపించారు.